సాక్షి జగిత్యాల

గురువారం । 30 । జనవరి । 2025

'చిలుక చిన్నమ్మ'కు బోనాలు

మల్లాపూర్: మండలంలోని సంగెంశ్రీరాంపూర్‌లో చిలుకల చిన్నమ్మకు భక్తులు బోనాలు సమర్పించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. 50 ఏళ్లుగా చిలుకల చిన్నమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంగెంశ్రీరాంపూర్, కుస్తాపూర్, రత్నాపూర్, నడికుడ గ్రామాల్లోని ప్రతి ఇంటి నుంచి ఒకరు సమీప గోదావరి నదిలో పుణ్యస్నానం ఆచరించి నది జలాలను తమవెంట తీసుకొచ్చి గ్రామదేవతలకు అభిషేకం నిర్వహించారు. బోనాలతో శోభాయాత్రగా తరలివచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని పూజిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం.





న్యూస్‌రీల్

నృసింహాలయంలో భక్తుల రద్దీ



మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. మౌన అమావాస్య సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు.

అభివృద్ధి పనులకు మార్గదర్శకాలివ్వండి



సీఎం వినతిపత్రం అందిస్తున్న ప్రభుత్వ విప్

ధర్మపురి: ధర్మపురి నియోజకవర్గంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మార్గదర్శకాలు జారీ చేయాలని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. బుధవారం సీఎం చాంబర్‌లో ఆయనను కలుసుకున్నారు. ధర్మపురిలో మురుగునీటి పరిష్కారానికి సీవరేజ్ ప్లాంట్ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని, నేరెల్లలో కేంద్రం ప్రకటించిన జవహర్ నవోదయ పాఠశాల స్థాపనకు మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు.

డీపీవోగా హరికిషన్

జగిత్యాల: జిల్లా పంచాయతీ అధికారిగా హరికిషన్‌ను నియమిస్తూ ప్రభుత్వ సెక్రెటరి లోకేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. హరికిషన్ వెయిటింగ్ లిస్ట్‌లో ఉండగా.. జగిత్యాలకు నియమించారు.

'ప్రాక్టికల్స్'లో సీసీ కెమెరాలు తప్పనిసరి

జగిత్యాల: ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 3 నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు వసతులు కల్పించాలని అడిషనల్ కలెక్టర్ గౌతమ్‌రెడ్డి అన్నారు. ఇంటర్మీడియెట్ అధికారులతో బుధవారం సమావేశమయ్యారు. పరీక్ష కేంద్రాల్లో నిరంతరం విద్యుత్ ఉండేలా చూడాలన్నారు. వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. సకాలంలో కేంద్రాలకు చేరేలా బస్సులు నడపాలని డిపో మేనేజర్లకు సూచించారు. ఇంటర్ నోడల్ అధికారి నారాయణ, డీఈవో రాము, ఫైర్ ఆఫీసర్ పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

జగిత్యాల: జిల్లాలో బాలబాలికల లింగ నిష్పత్తి సమానత్వం సాధించేలా కృషి చేయాలని అదనపు కలెక్టర్ లత అన్నారు. బుధవారం బేటీ బచావో బేటీ పడావో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో మహిళలు, పిల్లలతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. బాలికలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మహిళలు చట్టాలపై అవగాహన, హక్కులు తెలుసుకోవాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. వివిధ రంగాల్లో రాణించిన బాలికలు, మహిళలను సన్మానించారు. మొక్కలు నాటారు. జిల్లా సంక్షేమాధికారి నరేశ్, డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ఎస్సీ సంక్షేమాధికారి రాజ్‌కుమార్, డీఈవో రాము పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి

జగిత్యాలక్రైం: వేసవిలో నాణ్యమైన విద్యుత్ అందేలా చూడాలని జిల్లా సర్కిల్ నోడల్ అధికారి తిరుమల్‌రావు అన్నారు. బుధవారం విద్యుత్‌శాఖ అధికారులతో టీజీఎన్‌పీడీసీఎల్ భవన్‌లో సమీక్షించారు. వేసవికాలానికి సంబంధించి కార్యాచరణ చేపట్టాలన్నారు. జిల్లా పరిధిలో 13/33 కేవీ ఇంటర్లింకింగ్ పనులు 8 పూర్తయ్యాయని, మిగతావి ఫిబ్రవరి 10లోపు పూర్తి చేయాలని సూచించారు. అధిక లోడున్న 315 ట్రాన్స్‌ఫార్మర్లకు 201 పూర్తయ్యాయన్నారు. జగిత్యాలలో రెండు అదనపు 130 కేవీ పనులు పూర్తయ్యాయన్నారు. వినియోగదారులకు నిరంతర సర్వీస్ చేసేలా ప్రతి ఉద్యోగి స్థానికంగా ఉండాలన్నారు. 24/7 నిరంతర విద్యుత్ సేవలకు 1912 టోల్‌ఫ్రీ నంబరుకు డయల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఈ ఐవీసీ రాక్, ఎస్ఈ సాల్యానాయక్, డీఈలు, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన తప్పనిసరి



జగిత్యాలక్రైం: సీపీఆర్ చేసి ప్రాణాలు రక్షించవచ్చని, దీనిపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో ఫస్ట్‌ఎయిడ్ సీపీఆర్ ట్రైనింగ్ నిర్వహించగా.. ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. రోడ్డు ప్రమాద సమయంలో ధైర్యంతో ముందుకెళ్లి బాధితుల ప్రాణాలు కాపాడితే జీవితాంతం మర్చిపోరని అన్నారు. జిల్లాలో 74 హాట్‌స్పాట్ కేంద్రాలు గుర్తించామన్నారు. అనంతరం బొమ్మకు సీపీఆర్ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, వైద్యులు ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి, పోలీస్ అధికారులు, సోషల్ రెస్పాండ్ సభ్యులు పాల్గొన్నారు.

మండలి కోడ్ కూసింది

- పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు షెడ్యూల్ విడుదల
- వచ్చేనెల 3న నోటిఫికేషన్..27న పోలింగ్, మార్చి 3న ఓట్ల లెక్కింపు
- మార్చి 8న పూర్తికానున్న ఎన్నికల ప్రక్రియ
- పకడ్బందీగా కోడ్ అమలు చేయాలి: కలెక్టర్



పట్టభద్రుల కొత్త ఓటర్ల వివరాలు	
కరీంనగర్	1,380
జగిత్యాల	562
పెద్దపల్లి	722
రాజన్న సిరిసిల్ల	587
మొత్తం	3,251

షెడ్యూల్ ఇలా..

నోటిఫికేషన్ విడుదల	03-02-2025
నామినేషన్ల చివరితేదీ	10-02-2025
నామినేషన్ల స్క్రూటినీ	11-02-2025
విత్‌డ్రాలకు చివరితేదీ	13-02-2025
పోలింగ్ తేదీ	27-02-2025
ఓట్ల లెక్కింపు	03-03-2025
ఎన్నికల ప్రక్రియపూర్తి	08-03-2025

సాక్షిప్రతినిధి,కరీంనగర్: శాసనమండలిలో త్వరలో ఖాళీ కానున్న ఉమ్మడి కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల అయ్యింది. బుధవారం మధ్యాహ్నం ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. గురువారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రారంభోత్సవాలను అధికార పార్టీ నాయకులు వాయిదా వేసుకున్నారు. మరోవైపు ఎన్నికల కోసం ఇంతకాలం సిద్ధమవుతున్న ఆయా పార్టీల నాయకులు, స్వతంత్రులు ప్రచార వేడిని పెంచేందుకు సిద్ధమవుతున్నారు. వచ్చేనెల 3వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుండగా.. మార్చి 8వ తేదీన ఎన్నికల ప్రక్రియ ముగియనుంది.

సింహభాగం ఇక్కడే..

ఉమ్మడి జిల్లాలోని పట్టభద్రులు, టీచర్ల సింహభాగం ఓట్లు ఇక్కడే ఉన్నాయి. గతేడాది డిసెంబరు 30 వరకు 3.41లక్షల పట్టభద్రుల ఓట్లు ఉండగా, కరీంనగర్‌లో దాదాపు 1.55 లక్షలకుపైగా ఓట్లున్నాయి. టీచర్ల ఓట్ల విషయానికి వస్తే.. మొత్తం 25,921 ఓట్లు ఉండగా.. 7,659 ఓట్లు కరీంనగర్‌లో ఉన్నాయి. అందుకే, టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు పోటీచేసే అభ్యర్థులు ఉమ్మడి జిల్లాపైనే దృష్టి కేంద్రీకరించారు. మిగిలిన మూడు జిల్లాల్లో ప్రచారం చేస్తూనే.. కరీంనగర్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. దీనికితోడు ఈనెల ఒకటో తేదీ నుంచి వచ్చేనెల మూడో తేదీ వరకు కొత్త ఓటర్ల నమోదు కోసం మరోసారి అవకాశం ఇవ్వగా.. 3,251 గ్రాడ్యుయేట్లు, 676 మంది టీచర్లు దరఖాస్తు చేసుకున్నారు.

తక్షణమే కోడ్ అమల్లోకి.. కలెక్టర్ పమేలా సత్పతి

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. ఎన్నికల నియమావళిపై జిల్లా అధికారులతో బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న రాజకీయ నాయకులకు సంబంధించిన ఫొటోలు, ప్రకటనలు, పోస్టర్లు, బ్యానర్లు వంటివి తొలగించాలన్నారు. బస్టాండ్, పబ్లిక్ పార్క్ వంటి ప్రజలు సందర్శించే చోట్లలో ఉన్న హోర్డింగులు, బ్యానర్లు, స్టిక్కర్లు, గోడలపై రాతలు తీసివేయాలని, విగ్రహాలను కవర్ చేయాలని పేర్కొన్నారు. సరైన పత్రాలు లేకుండా రూ.50 వేల కంటే ఎక్కువ నగదును తరలిస్తే సీజ్ చేయాలని అన్నారు.

పెరగనున్న ప్రచార వేడి..

నోటిఫికేషన్ వచ్చిన దరిమిలా అభ్యర్థులు ప్రచారం వేగం పెంచనున్నారు. అదే సమయంలో ఎవరు బరిలో ఉంటారు? ఎవరు తప్పుకోనున్నారు. టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఆశావహుల్లో మొన్నటి దాకా ప్రచారం చేసిన సగంమందిలో ఇప్పటికే తప్పుకుంటారన్న ప్రచారం జోరందుకుంది. అన్న విషయంపైనా త్వరలోనే స్పష్టత రానుంది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి కాంగ్రెస్ నుంచి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, ప్రసన్న హరికృష్ణ పోటీ పడుతున్నారు. ఇక బీఆర్ ఎస్ నుంచి మాజీ మేయర్‌సర్దార్ రవీందర్ సింగ్, శేఖర్‌రావు, డా.బీఎస్ రావు, బీజేపీ నుంచి అంజిరెడ్డి పోటీలో ఉన్నారు. టీచర్ ఎమ్మెల్సీ బరిలో మానేరు విద్యా సంస్థల కడారు అనంత్‌రెడ్డి, పీఆర్‌టీయూ బలపరిచి వంగా మహేందర్ రెడ్డి, బీజేపీ అనుబంధ తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయం సంఘం (టపస్) తరఫున మల్క కొమురయ్య, ఎస్టీయూ నుంచి సంకినేని మాధవరావు బరిలో ఉన్నారు.

ఉమ్మడి జిల్లా ఓటర్లు ఇలా..

పట్టభద్రుల ఓటర్ల వివరాలిలా..

జిల్లా	పురుషులు	స్త్రీలు	థర్డ్‌జెండర్	మొత్తం
కరీంనగర్	41665	27992	0	69657
జగిత్యాల	21075	13206	0	34281
పెద్దపల్లి	18430	11638	1	30069
రాజన్న సిరిసిల్ల	13290	8323	1	21614
మొత్తం	94,460	61,159	2	1,55,621

ఉపాధ్యాయుల ఓటర్ల సంఖ్య

జిలా	పురుషులు	స్త్రీలు	మొత్తం
కరీంనగర్	2512	1508	4020
జగిత్యాల	1197	509	1706
పెద్దపల్లి	609	450	1059
రాజన్న సిరిసిల్ల	633	241	874
మొత్తం	4951	2708	7659

ఉపాధ్యాయుల కొత్త ఓటర్ల దరఖాస్తులు	
కరీంనగర్	366
జగిత్యాల	68
పెద్దపల్లి	166
రాజన్న సిరిసిల్ల	76
మొత్తం	676

ఆకలి చదువులు!

- ఆకలితోనే చదువులు
- కొనసాగుతున్న ప్రత్యేక క్లాస్‌లు
- గతంలో 'ఉత్తేజం' కింద నిధులు
- తాజాగా ఎవరూ ముందుకు రాని తీరు
- జిల్లాలో 7,497 మంది విద్యార్థులు



పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

రాయికల్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు గతంలో పనిచేసిన జిల్లా కలెక్టర్లు 'ఉత్తేజం' వంటి కార్యక్రమాలు చేపట్టారు. దీనికి కొందరు విరాళాలు ప్రకటించగా.. ప్రభుత్వం నుంచి కొంత మొత్తం నిధులు విడుదలయ్యేవి. ఈ నిధులతో ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు అల్పాహారం అందించేవారు. పరీక్షలు ప్రారంభమయ్యే వరకూ అల్పాహారం అందించి వారిని ప్రోత్సహించేవారు. ప్రస్తుత జిల్లా విద్యాశాఖ అధికారులు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నప్పటికీ అల్పాహారం విషయంలో మాత్రం చొరవ చూపడం లేదు. ఫలితంగా వివిధ గ్రామాల నుంచి వేకువజామునే బస్సుల్లో వచ్చే విద్యార్థులు ఆకలితోనే చదువుకునే పరిస్థితి నెలకొంది.

7,497 మంది విద్యార్థులు

జిల్లాలో 189 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అలాగే మోడల్ స్కూళ్లు, 13, కేజీబీవీ 16, రెసిడెన్షియల్ స్కూళ్లు 2 ఉన్నాయి. ఇందులో 7,497 విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్నారు. వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు గతేడాది అక్టోబర్ నుంచే విద్యాశాఖ సాయంత్రం 4.15గంటల నుంచి 5.15 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. ఈనెల 20 నుంచి ఉదయం 8.15 గంటల నుంచి 9.15 వరకు ప్రతిరోజూ ఓ సబ్జెక్ట్ ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేసి విద్యార్థులను చదివించడం, వారి సందేహాలను నివృత్తి చేయడం, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించడం చేస్తున్నారు.

ఆకలితో విద్యార్థులు

చదువుకునేందుకు ఉదయం 8గంటలకే విద్యార్థులు పాఠశాలకు చేరుకుంటున్నారు. వీరిలో చాలామంది నిరుపేదలే ఉంటున్నారు. అంత ఉదయం ఇళ్లలో వంటకాలు కాకపోవడంతో ఏమీ తినకుండానే పాఠశాలకు చేరుకుంటున్నారు. అలాంటి వారికి మధ్యాహ్న భోజనమే దిక్కవుతోంది. మధ్యాహ్నం వరకూ విద్యార్థులు ఖాళీ కడుపుతోనే ఉండాల్సి వస్తోంది. మధ్యాహ్న భోజనం అనంతరం సాయంత్రం 4.15 గంటల నుంచి 5.15 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలోనూ పిల్లలు ఆకలితోనే అలమటించాల్సి వస్తోంది. ఫలితంగా విద్యార్థులు నీరసించిపోతున్నారు.

జిల్లా యంత్రాంగం, దాతలు స్పందించాల్సిందే

జిల్లాలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులపై జిల్లా కలెక్టర్‌తో పాటు, విద్యాశాఖ అధికారులు స్పందించి గతంలో మాదిరిగా ప్రభుత్వ పాఠశాలలకు అల్పాహారం కింద నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు. దాతల సహకారంతో స్నాక్స్ అందిస్తే విద్యార్థులను ప్రోత్సహించినట్లవుతుందని అంటున్నారు. పైగా ఉత్తీర్ణత శాతం పెంచేందుకు దోహదపడుతుందని అంటున్నారు.

ఉదయం 7గంటలకే వస్తున్నాం



మాది రాయికల్ మండలం అయోధ్య గ్రామం. రాయికల్ బాలికల ఉన్నత పాఠశాల్లో చదువుతున్న. ఉదయం 8 గంటలకే ప్రత్యేక క్లాసులు ఉండటంతో ఉదయం ఏడు గంటలకే బయల్దేరి బస్సులో వస్తున్నాం. సాయంత్రం వరకు పాఠశాలలోనే ఉండటం ద్వారా కొంత నీరసంగా ఉంటోంది. కేవలం మధ్యాహ్న భోజనమే తిని ఉంటున్నాం. మాకు అల్పాహారం అందిస్తే కొంత మేలు.

– మహిత, అయోధ్య

ఆకలేస్తోంది



మాది రాయికల్ మండలం అయోధ్య గ్రామం. బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకుంటున్నాం. ఉదయం, సాయంత్రం సమయంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మేం కూడా చదువుకుంటున్నాం. సాయంత్రం వేళ ఆకలి అవుతోంది. ఇంటికి చేరేసరికి రాత్రి అవుతోంది. పొద్దున వెళ్లిన మేము రాత్రి ఇంటికి చేరుకుంటున్నాం. వచ్చేసరికి నీరసించి పోతున్నాం.

– మేఘన, అయోధ్య

దాతలు సహకరించాలి



పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం కోసం విద్యాశాఖ నుంచి ఎలాంటి నిధులు మంజూరు కాలేదు. నిధులు మంజూరు కాగానే ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేస్తాం. ఉదయం జావా అందిస్తున్నాం. ఆయా గ్రామాల్లోని దాతలు కూడా ముందుకు రావాలి. అందరూ సహకరించి పదో తరగతి విద్యార్థుల కోసం అల్పాహారం ఏర్పాటు చేసుకోవాలి.

– రాము, డీఈవో

దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

మెట్‌పల్లి: ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. మినీ స్టేడియంలో నిలిచిపోయిన భవన నిర్మాణ పనులు తెలుసుకున్నారు. వైకుంఠ ధామం, డంపింగ్‌యార్డులను సందర్శించారు. ఆయన వెంట ఆర్డీఓ శ్రీనివాస్, తహశీల్దార్ శ్రీనివాస్, కమిషనర్ మోహన్, డీఈఈ నాగేశ్వర్‌రావు తదితరులున్నారు.

అమల్లోకి ఎమ్మెల్సీ కోడ్

జగిత్యాల: ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో జిల్లాలో గురువారం నుంచి కోడ్ అమలులో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రులు, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ టీచర్స్, వరంగల్, ఖమ్మం, నల్గొండ టీచర్స్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైందన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. ఇటీవల పుదుచ్చేరిలో జరిగిన దక్షిణ భారత సైన్స్ ఫెస్టివల్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థి మణిదీప్, వర్షిత, గైడ్ టీచర్ సతీశ్, ఉపాధ్యాయుడు అభయ్‌రాజ్‌ను అభినందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి, డీఈవో రాము, జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్ ఉన్నారు.

పారిశుధ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. బుధవారం ఎంపీడీవో, ఎంపీవోలతో సమీక్షించారు. ఇంటి పన్ను వందశాతం వసూలు చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో ఉన్న ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, గోడరాతలను తొలగించాలని ఆదేశించారు.

నిందితులకు శిక్ష పడేలా చూడాలి



పబ్లిక్ ప్రాసిక్యూటర్లను సన్మానిస్తున్న ఎస్పీ

జగిత్యాలక్రైం: నిందితులకు శిక్ష పడేలా చూడడంలో పోలీస్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పాత్ర కీలకమని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో పోలీస్, పీపీలతో సమావేశమయ్యారు. ఈ ఏడాది 64 కేసుల్లో నిందితులకు జైలు శిక్ష పడిందన్నారు. సాక్షులను సరైన పద్ధతిలో ప్రవేశపెట్టి కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పీపీలు నూతన చట్టాల్లో కలిగే సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం పీపీలు రాజేశ్, రజిని, ప్రణయ్, మల్లికార్జున్, మల్లేశం, రామకృష్ణారావును ఎస్పీ అభినందించారు.

ప్రజలకు మంచి సేవలందించాలి

సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలని ఎస్పీ అన్నారు. తన కార్యాలయంలో నేరాలపై సమీక్షించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి చొరవ చూపించాలన్నారు. అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలు, వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. రాత్రి పూట పెట్రోలింగ్ నిర్వహించాలని, డయల్ 100కు వచ్చిన ఫిర్యాదులకు వెంటనే స్పందించాలన్నారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంస, ప్రోత్సాహకాలు అందించారు. డీఎస్పీలు రఘుచందర్, రాములు, రంగారెడ్డి, సీఐలు శ్రీనివాస్, ఆరిఫ్‌అలీఖాన్, రఫీక్ ఖాన్, వేణుగోపాల్, రామ్ నరసింహారెడ్డి, రవి, నిరంజన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సురేశ్, ఆర్ఐ కిరణ్ కుమార్, వేణు, ఎస్సైలు, డీసీఆర్బీ, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లపల్లిలో దర్జాగా ప్రభుత్వ భూముల కబ్జా!

- అధికార పార్టీ నాయకుల అండదండలు
- అక్రమంగా ఇళ్ల నిర్మాణం
- సొమ్ము చేసుకుంటున్న నాయకులు
- మూడు నెలల్లో 50కి పైగా ప్లాట్ల కబ్జా, విక్రయం
- చర్యలు తీసుకోవాలని అధికారులకు విప్ అడ్లూరి ఆదేశం



రామాలయం వెనుక ప్రభుత్వ భూమిలో కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణాలు



ఇళ్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ వరందన్

గొల్లపల్లి: గొల్లపల్లి మండలకేంద్రంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. ఏకంగా అధికార పార్టీ నాయకులే ప్రభుత్వ స్థలాలు చదును చేస్తూ.. స్థానికులు, స్థానికేతరులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. స్థలాలు కొన్న వారు ఇళ్ల నిర్మాణాలు కూడా ప్రారంభించారు. స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారపార్టీ నాయకుల హస్తం ఉండటంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారు. అయితే ఈ విషయం స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దృష్టికి ఆలస్యంగా వెళ్లడంతో తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ఆక్రమణదారులు ఎవరైనా వదిలిపెట్టొద్దని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.మండలకేంద్రంలోని 735, 544తోపాటు ఇతర సర్వే నంబర్లలో ప్రభుత్వ భూమి ఉంది. 735లో 299 ఎకరాలు ఉండగా.. 102 ఎకరాల్లో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించారు. మిగిలిన 197 ఎకరాలకు అధికారిక లెక్కలు లేవు. దీనిని ఆసరా చేసుకున్న అక్రమార్కులు కబ్జాపర్వానికి తెరలేపారు. వాటిని విక్రయించి సొమ్ముచేసుకునేందుకు పూనుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం.. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ప్రకటించడంతో అదే పార్టీలోని కొందరు నాయకుల కన్ను ఈ భూమిపై పడింది.

నాలుగు నెలలుగా కబ్జా..

సర్కారు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వనుందని భావించిన కొందరు నాయకులు 735 సర్వేనంబర్‌లోని రామాలయం గుట్ట వెనుక వైపు ప్రాంతాన్ని నాలుగు నెలలుగా ట్రాక్టర్, జేసీబీలతో చదును చేయించి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇది ఆనోటా ఈనోట తెలుసుకున్న పేదలు అక్కడికి దారిపట్టారు. దీనిని అదునుగా భావించిన నాయకులు స్థలాన్ని ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నారు. ఇలా ఇప్పటికే దాదాపు 50కి పైగా ప్లాట్లు విక్రయించారు. 15 మందికి పైగా ఇళ్లు నిర్మించుకున్నారు. అధికారులకు ఈ విషయం తెలిసినా.. ఆక్రమణదారులు అధికార పార్టీ నాయకులే కావడంతో చూసీచూడనట్లు వ్యవహరించారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం

735తోపాటు 544 సర్వేనంబర్లలోని భూమిని తాజామాజీ సర్పంచ్ నిశాంత్‌రెడ్డి, గత రెవెన్యూ, పంచాయతీ అధికారులు కబ్జా చేస్తున్నారని అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు చెవులమద్ది హన్మండ్లు గతేడాది అక్టోబర్ 21న కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఏకంగా కలెక్టర్‌కే ఫిర్యాదు చేశారు. కానీ.. చర్యలు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రాలేదు.

ఎమ్మెల్యే ఆదేశాలతో..

ప్రభుత్వ భూమి కబ్జా విషయం ఎమ్మెల్యే దృష్టికి ఆలస్యంగా రావడంతో వెంటనే ఆగ్రహానికి గురయ్యారు. తమ పార్టీ పేరు చెప్పుకుని ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే సహించొద్దని, ఎంతటి వారైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ వరందన్‌ను ఆదేశించారు. ఈ మేరకు తహసీల్దార్ హుటాహుటిన ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న రామాలయం గుట్ట వద్దకు వెళ్లారు. ఆక్రమణదారులను మందలించారు. అయితే అధికార పార్టీకే చెందిన ఓ నాయకుడు ఇక్కడ ఇల్లు కట్టుకొమ్మన్నాడని తహసీల్దార్‌కు చెప్పడంతో కంగుతిన్న ఆయన ధ్రువీకరణపత్రాలు చూపించాలన్నారు. దీనికి వారు తమ వద్ద ఎలాంటి ఆధారాలూ లేవని చెప్పడం గమనార్హం.

అక్రమంగా నిర్మిస్తే కూల్చేస్తాం..

ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టొద్దని తహసీల్దార్ అన్నారు. 735 సర్వే నంబర్‌లో అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటివరకు 40ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని, వారు సామగ్రితో సహా వెళ్లకుంటే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ భూముల్లో ఇల్లు నిర్మించుకోవాలని కొందరు చెప్పే మాటలు పట్టించుకోవద్దన్నారు. బాధితులను ఉసిగొల్పుతున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

అనారోగ్య సమస్యలతో సింగరేణి కార్మికుడి ఆత్మహత్య

రామగిరి(మంథని): పన్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సెంటినరీకాలనీకి చెందిన సింగరేణి కార్మికుడు దాయాకి శ్రీనివాస్(56) బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. శ్రీనివాస్ ఆర్నెల్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. దీంతో మనస్థాపానికి గురై బుధవారం ఉదయం తను నివాసం ఉండే సెంటినరీకాలనీ జోన్-1లోని ఎస్టీ-2-551నంబరు క్వార్టరు వరండాలోగల రేకుల షెడ్డుకు ఉరివేసుకున్నాడు. తన భార్య అరుణ లేచి చూసేసరికి మృతి చెంది కనిపించడంతో బోరున విలపించింది. మృతుడి పెద్దకూతురు మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువ రైతు మృతి


నవీన్‌రెడ్డి (ఫైల్)

• రామాజీపేటలో విషాదం

రాయికల్: రాయికల్ మండలం రామాజీపేట గ్రామానికి చెందిన రైతు ఇద్దం నవీన్‌రెడ్డి (32) పొలం దున్నుతుండగా ట్రాక్టర్ బోల్తాపడి మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నవీన్‌రెడ్డి కేజీ వీల్స్ ట్రాక్టర్‌తో నాట్ల కోసం పొలం దున్నుతున్నాడు. ఇంతలో బురదలో దిగబడింది. ట్రాక్టర్‌ను బయటకు తీసే క్రమంలో బోల్తాపడింది. ఈ ఘటనలో బురదలో కూరుకుపోయిన నవీన్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. నవీన్‌కు భార్య, నాలుగేళ్ల కూతురు, ఏడాదిన్నర కుమారుడు ఉన్నారు. ఏడాది క్రితం నవీన్ తండ్రి మృతిచెందడంతో అప్పటినుంచి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇప్పుడు ఆయన కూడా మృతిచెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. మృతుడి తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధీర్ రావు తెలిపారు.

అక్రమ వసూళ్లకు పాల్పడిన వ్యక్తి రిమాండ్

సిరిసిల్ల క్రైం: సిరిసిల్లలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన సుదర్శన్ విలేకరి ముసుగులో అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు సిరిసిల్ల ధోబీగల్లీకి చెందిన వొడ్నాల విక్రం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కృష్ణ తెలిపారు. ఈ నెల 23న కోనరావుపేట మండలం నుంచి కలపలోడ్‌తో ట్రాక్టర్ చంద్రంపేట వద్దకు రాగానే సుదర్శన్ అడ్డగించి డబ్బులు డిమాండ్ చేశాడని, టింబర్ యజమాని విక్రం పిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గడ్డంపల్లిలో చోరీ

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): రామగిరి మండలం సుందిళ్ల గ్రామపంచాయతీ పరిధి గడ్డంపల్లిలో గడ్డం రాజయ్య అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న రాజయ్యను ఈనెల16న కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడే ఉండి చికిత్స అందిస్తున్నారు. ఈక్రమంలో ఈనెల 29న ఇంటికి వచ్చారు. తాళం పగులగొట్టి ఉండడాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ప్రసాద్‌రావు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలు పరిశీలించారు. ఇంట్లోని బీరువాలో దాచిన రూ.50వేల నగదు, వంద తులాల వెండి, తులం గోల్డ్‌చైన్ చోరీకి గురైనట్లు రాజయ్య భార్య ఓదమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

తెల్లారిన బతుకులు

- మూడు ప్రాణాలు తీసిన నిద్రమత్తు
- స్టీరింగ్ వదిలిపెట్టిన డ్రైవర్.. కల్వర్టును ఢీకొన్న కారు
- దంపతులతోపాటు మరో వ్యక్తి దుర్మరణం
- ఆరుగురికి తీవ్రగాయాలు
- మాఘమాసం పుణ్యస్నానాలకు కాళేశ్వరం వెళ్తుండగా ఘటన
- మృతులు సిద్దిపేట జిల్లావాసులు


ఆకుల తార (ఫైల్) ఆకుల కనుకయ్య (ఫైల్) జనార్దన్ (ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్: డ్రైవర్ నిద్రమత్తు ముగ్గురు ప్రాణాలు తీసింది. మరోఆరుగురిని తీవ్రంగా గాయపర్చింది. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి వద్ద రాజీవ్ రహదారిపై బుధవారం వేకువజామున 5.30గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘటనలో భార్యాభర్తలు ఆకుల కనుకయ్య(69), తార(62) అక్కడిక్కడే మృతి చెందారు. కనుకయ్య వియ్యంకుడు జనార్దన్(62) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా కేంద్రంలోన శ్రీనగర్‌కాలనీకి చెందిన ఆకుల కనుకయ్య మేస్త్రీ పని చేస్తూ కుటుంబాన్ని సాకుతున్నాడు. మాఘమాసం సందర్భంగా కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఓ ప్రైవేట్ కారును అద్దెకు తీసుకున్నారు. అందులో భార్య తార, వీరి పెద్దకుమారుడు శ్రీనివాస్(40), మనుమలు అభిత్(10), మాన్విత్(04), శ్రీనివాస్ అత్తమామ సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం గొనెపల్లి గ్రామానికి చెందిన జనార్దన్-రమాదేవి(60), బావమరిది మనోజ్‌కుమార్(30)తో కలిసి సిద్దిపేటలో బుధవారం వేకువజామను బయల్దేరారు. వారు కాట్నపల్లికి చేరుకోగా.. నిద్రమత్తులోకి వెళ్లిన డ్రైవర్ బాల్‌రెడ్డి.. ఒక్కసారిగా స్టీరింగ్ వదిలిపెట్టాడు. దీంతో వేగంగా ఉన్న వాహనం కల్వర్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు కనుకయ్య, తార అక్కడిక్కడే దుర్మరణం చెందారు. గాయపడిన వారిని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జనార్దన్ మృతి చెందాడు. డ్రైవర్‌తోపాటు శ్రీనివాస్, అభిత్, మాన్విత్, రమాదేవి, మనోజ్‌కుమార్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వీరి పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. కనుకయ్య చిన్న కుమారుడు రాజేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్నట్లు ఎస్సై వివరించారు. పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి కరీంనగర్‌కు వెళ్లి ప్రమాద వివరాలపై ఆరా తీశారు.


కల్వర్టును ఢీకొని నుజ్జునుజ్జు అయిన కారు

హెల్త్ చెకప్‌కు వెళ్తూ హఠాన్మరణం


అలీం పార్థివదేహం వద్ద నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష


అలీం పార్థివదేహానికి నివాళి అర్పిస్తున్న రామగుండం ఎమ్మెల్యే రాకూర్

- గుండెపోటుతో అంతర్గాం ఎంపీడీవో అలీం మృతి
- పని ఒత్తిడే కారణమా?


మహ్మద్ అబ్దుల్ అలీం, ఎంపీడీవో


రామగుండం: అంతర్గాం మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీవో) మహ్మద్ అబ్దుల్ అలీం(60) హెల్త్‌చెకప్ కోసం వెళ్తూ గుండెపోటుతో కన్నుమూశారు. వారంరోజులుగా అనారోగ్యంతోనే బాధపడుతున్నారు. అయినా, ప్రజాపాలన గ్రామసభలకు హాజరవుతూనే అధికారుల సాయంతో సంక్షేమ పథకాల ప్రక్రియ చేపడుతున్నారు. అయితే, డాక్టర్లను సంప్రదించేందుకు బుధవారం ఉదయం హైదరాబాద్‌కు కారులో వెళ్తున్నారు. మార్గమధ్యంలోనే గుండెపోటు రావడంతో చనిపోయారు. అంతర్గాం ఎంపీడీవోగా ఆయన గతేడాది ఫిబ్రవరి 13న బాధ్యతలు స్వీకరించారు. ఈ ఏడాది ఆగస్టు 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు. అలీం స్వస్థలం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ కాగా మంచిర్యాలలో నివాసం ఉంటున్నారు. విధుల నిర్వహణకు అక్కడి నుంచి వచ్చివెళ్తున్నారు. ఆయనకు ఒక కుమారుడు, భార్య ఉన్నారు. మృతదేహాన్ని కాగజ్‌నగర్ తరలించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అలీం మృతదేహానికి నివాళి అర్పించారు. ఎంపీపీ సూపరింటెండెంట్ కరుణాకర్, సిబ్బంది, సీఐ ప్రవీణ్, ఎస్సై వెంకటస్వామి తదితరులు అలీం కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కలెక్టర్ పరామర్శ

పెద్దపల్లిరూరల్: ఎంపీడీవో అలీం కుటుంబసభ్యులను కలెక్టర్ కోయ శ్రీహర్ష పరామర్శించారు. గుండెపోటుకు గురైన మహ్మద్ అలీంను తొలుత పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు రాగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ ఆస్పత్రికి చేరుకుని నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీధర్, పలువురు అధికారులు ఉన్నారు.

కండ్లపల్లిలో అపురూప శిల్పాలు

• వేయ్యేళ్ల నాటివిగా చెబుతున్న చరిత్రకారులు • జైనం, శైవం, వైష్ణవ శిల్పాలుగా ఆనవాళ్లు


ఋషభదేవుడు, వృషభవాహనుడు, మమ్మాయి


పరిశీలిస్తున్న బృందం

సారంగాపూర్: జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం కండ్లపల్లి గ్రామంలో 8వ శతాబ్దం నుంచి 18వ శతాబ్దం మధ్యకాలంనాటి వివిధ రూపాల్లో ఉన్న శిల్పాలు పదులకొద్ది బయటపడ్డాయి. తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ రామోజు హరగోపాల్ ఆధ్వర్యంలో వొద్దిపర్తి మధుకుమార్, చిట్నేని విజయ్‌కుమార్ కలిసి వారం రోజులుగా పరిశోధనలు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో వెలుగుచూసిన శిల్పాలను ఒక చోటకు చేర్చి అవి ఏ కాలంలోనివో గుర్తిస్తున్నారు. ఈ మేరకు బుధవారం వాటి వివరాలను వెల్లడించారు. తమ పరిశోధనలో రాష్ట్రకూటశైలితో జైన తీర్థంకరుడు, ఋషభుని ధ్యానసన శిల్పం, రెండు వృషభలాంఛనాలతో ఋషభుని శిల్ప స్తంభాలు బయటపడ్డాయని, వర్ధమహావీరుని అధిష్టాన పీఠం, జైనబసది పూర్ణకలశం, 14, 15 శతాబ్దాల శైలిలో గణపతి, కేశవమూర్తులు ఇద్దరు, కుభేరుడు, విష్ణుమూర్తి, మహిషాసురమర్ధిని, నాగదేవత తదితర శిల్పాలు వెలుగు చూశాయన్నారు. 17, 18వ శతాబ్దాల కాలం నాటి శైలిలో చెక్కిన లోహకారుల దేవతా మమ్మాయి శిల్పాలు, పూర్తిగా శిథిలమైన రెండు బహుభుజుల దేవతల శిల్పాలు, మరోచోట జైన తీర్థంకరుని శిల్పంతో శాసన స్తంభం బయటపడ్డాయన్నారు.

గ్రామంలో ఎటుచూసినా శిల్పాలే..

కండ్లపల్లి గ్రామంలో ఎటు చూసినా వివిధ రూపాల్లో శిల్పాలు ఉన్నాయని చరిత్రకారులు వివరించారు. వీటిపై గ్రామస్తులకు పెద్దగా అవగాహన లేకపోవడంతో విగ్రహాలు గడ్డి, చెత్తలోనే ఉండిపోయాయి. కొందరు తమతమ భూములకు హద్దు రాళ్లగాను పెట్టుకున్నారు. ఇలాంటి వాటిపై పరిశోధన జరిపిన చరిత్ర బృందం సభ్యులు విజయ్‌కుమార్, మధుకుమార్ వివరాలు వెల్లడించడంతో గ్రామస్తులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఎటు చూసినా శిల్ప సంపద ఉన్న తమ గ్రామ వివరాలను ఎప్పుడూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లలేదని, వీటిపై మరిన్ని పరిశోధనలు చేయాలని గ్రామస్తులు గంగధరి పూర్ణచందర్, పర్వతం రమేశ్, వడ్లూరి రవి, కోట కిషన్, గంగధరి శ్రీనివాస్, గంగధరి శంకర్, అజ్మీర లక్ష్మణ్, గంగధరి గంగాధర్, కంది భీమన్న చరిత్రకారులను కోరారు. ప్రభుత్వం స్పందించి అద్భుతమైన ఇలాంటి వారసత్వ సంపదను పరిరక్షించాలని కోరారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

కోనరావుపేట: మండలంలోని దేవునితండా (నిమ్మపల్లి)వట్టిమల్ల, బావుసాయిపేట తండా, కమ్మరిపేట తండాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉంచిన 400లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఏడు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. మూడు కేసులు నమోదు చేసి 8మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐ మిట్టపల్లి శ్రీనివాస్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై శైలజ, సిరిసిల్ల ఎస్సై ప్రణీత్ పాల్గొన్నారు.

అపోలో ఫార్మసీలో ఉద్యోగావకాశాలు

కరీంనగర్ అర్బన్: కరీంనగర్ జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువతకు హైదరాబాద్‌లోని అపోలో ఫార్మసీ రిటేల్‌లో ఉద్యోగావకాశాలు ఉన్నాయని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్‌కు ఎస్సెస్సీ, ఫార్మసిస్టు ఉద్యోగాలకు డీఫార్మసీ లేదా బీఫార్మసీ చదివి, 18 నుంచి 35 ఏళ్ల వయసువారు అర్హులని పేర్కొన్నారు. వేతనం రూ.11 వేల నుంచి రూ.25 వేల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హతల జిరాక్స్‌లతో ఈ నెల 31న స్వశక్తి కాలేజీ పక్కన గల ఈజీఎంఎం కార్యాలయంలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు.

దొంగను పోలీసులకు అప్పగింత

వేములవాడ: వేములవాడలోని మోచీ వీధిలో మంగళవారం రాత్రి ఓ వ్యక్తి మూడుఇళ్లలో చోరీ చేస్తూ కాలనీవాసులకు పట్టుపడ్డాడు. అతన్ని స్తంభానికి కట్టేసి పోలీసులకు సమాచారం అందించారు. కాలనీవాసుల వివరాల ప్రకారం.. మోచీ వీధిలోని మూడిళ్లలో సదరు వ్యక్తి చొరబడేందుకు యత్నించాడు. సీసీ కెమెరాల వైర్‌కట్ చేశాడు. ఆ ఇండ్లలోని కొన్ని విలువైన వస్తువులను దోచుకున్నాడు. మరో ఇంటిలో చొరబడేందుకు యత్నిస్తుండగా గృహ యజమానులు సీసీ కెమెరాలను పరిశీలించి కాలనీవాసులను పోగుచేసి పట్టుకుని బంధించారు. పోలీసులకు సమాచారం అందించి, దొంగను అప్పించారు. సదరు వ్యక్తి మద్యంమత్తులో ఉన్నాడని, పూర్తి వివరాలు తెలుసుకుని వస్తువులు రికవరీ చేస్తామని పోలీసులు తెలిపారు.

శివలింగం అపహరణ



వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అనుపురంలో శివలింగాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. బుధవారం మాఘ అమావాస్య సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేసేందుకు వెళ్లిన గ్రామస్తులు గమనించగా గుడిలో శివలింగం అపహరణకు గురైనట్లు తెలిపారు. వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. శివలింగాన్ని అపహరించిన గుర్తు తెలియని వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేశ్ కోరారు.

ఐదుగురిపై డ్రంకెన్ డ్రైవ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్, రాచర్లగొల్లపల్లి, రాగట్లపల్లి గ్రామాల్లో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడిపిన ఐదుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. సరైనా ధ్రువపత్రాలు లేని 11మంది ద్విచక్ర వాహనదారులకు ఎస్సై రమాకాంత్ జరిమానాలు విధించారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం


సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

ఇల్లంతకుంట: కాంగ్రెస్ కార్యకర్తలు కేంద్ర హోం శాఖ మంత్రి బండి సంజయ్‌పై చేసిన వ్యాఖ్యలపై మండల బీజేపీ నాయకులు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇక్కడ జిల్లా కౌన్సిల్ మెంబర్ బత్తిని సాయి గౌడ్, రాష్ట్ర నాయకులు మేకల మల్లేశం, మామిడి హరీశ్, బత్తినిస్వామి, సీహెచ్ తిరుపతిరెడ్డి, కె శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో బార్ అండ్ రెస్టారెంట్ సీజ్


బార్ అండ్ రెస్టారెంట్ సీజ్ చేస్తున్న మున్సిపల్ అధికారులు


మున్సిపల్ కమిషనర్ లావణ్యతో బార్ యజమాని జిందం చక్రపాణి వాగ్వాదం

- ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేయలేదని తాళం
- మున్సిపల్ కమిషనర్‌తో యజమాని చక్రపాణి వాగ్వాదం

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలో బార్ అండ్ రెస్టారెంట్‌ను మున్సిపల్ అధికారులు ఆకస్మికంగా సీజ్ చేయడం వివాదాస్పదంగా మారింది. సుమారు గంటన్నర సేపు అక్కడ ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. బుధవారం మధ్యాహ్నం పూట గిరాకీతో కళకలాడుతున్న సిరిసిల్ల బైపాస్‌రోడ్డులోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌కు మున్సిపల్ కమిషనర్ దుబ్బాక లావణ్యతో పాటుగా అధికారులు వచ్చారు. అక్కడి వర్కర్లతో బార్ సీజ్ చేస్తున్నామని చెప్పడంతో వారు అవాక్కయ్యారు. వెంటనే బార్ యజమాని తాజా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కుమారుడు జిందం మహేందర్, భర్త జిందం చక్రపాణికి సమాచారం ఇచ్చారు. మహేందర్ వచ్చాక ట్రేడ్ లైసెన్సు ఫీజు కట్టనందుకు సీజ్ చేస్తున్నట్లు అధికారులు వివరించారు. జిందం చక్రపాణి వచ్చి ట్రేడ్ లైసెన్సు కట్టకుంటే బార్‌ను సీజ్ చేసే అధికారం మీకు లేదని మండిపడ్డారు. ఫీజు రుసుం చెల్లిస్తామని, వెంటనే వేసిన సీల్ తొలగించాలని డిమాండ్ చేశారు. చక్రపాణి డబ్బులు చెల్లించే ప్రయత్నం చేయగా కార్యాలయానికి వచ్చి ఆన్‌లైన్‌లో చెల్లించాలని కమిషనర్ లావణ్య సూచించి వెళ్తుండగా.. బార్ అండ్ రెస్టారెంట్ సిబ్బంది ఆమె వాహనం ఎదుట బైఠాయించారు. టౌన్ సీఐ కృష్ణ అక్కడికి చేరుకుని బార్ యజమాన్యంతో మాట్లాడి సర్దిచెప్పారు. బార్ యాజమాన్యం మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి ట్రేడ్ లైసెన్సు ఫీజు రూ.41,950 పెనాల్టీతో పాటుగా చెల్లించారు. లైసెన్స్ ఫీజు కట్టాలని ముందస్తు నోటీసులు జారీ చేయాలి కానీ, సీజ్ చేయడం సరికాదని జిందం చక్రపాణి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు జరిగిన అవమానం .. అధికారుల రాజకీయ కక్ష ధోరణిపై కోర్టుకు ఈడుస్తానని మండిపడ్డారు. ఎక్సైజ్ సీఐ ముస్తాఫా వచ్చి రెస్టారెంట్‌ను సీజ్ చేసే అధికారం బల్దియాకు ఉంటుందని, బార్‌ను సీజ్ చేసే అధికారం ఉండదని మున్సిపల్ కమిషనర్ ముందే మీడియాకు వివరించారు.

రాష్ట్రంలో ఎంఐఎందే సూపర్ పవర్

- కరీంనగర్ కార్పొరేషన్‌పై పార్టీ జెండా ఎగురవేస్తాం
- నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్


బుక్స్ అందిస్తున్న ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్

విద్యానగర్(కరీంనగర్): రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఎంఐఎందే సూపర్ పవర్ అని ఆ పార్టీ నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ అన్నారు. కరీంనగర్‌లోని ఎంఐఎం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు విభజించు.. పాలించు సిద్ధాంతాన్ని పాటిస్తున్నాయని ఆరోపించారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ దేశంలోని పేదల పక్షాన పార్లమెంట్‌లో అధికార పక్షాన్ని నిలదీస్తున్నారని పేర్కొన్నారు. గత మూడు అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ నియోజకవర్గంలో బీజేపీ మట్టికరవడంలో ఎంఐఎంది కీలకపాత్ర అని తెలిపారు. రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 25 స్థానాల్లో పార్టీ పోటీ చేస్తుందని, ఇక్కడ ఎంఐఎం జెండా ఎగురవేస్తామన్నారు. అనంతరం సాలారే మిల్లత్ ఆల్ ఇన్ వన్-2025 బుక్స్‌ను ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఉర్దూ మీడియం పదోతరగతి విద్యార్థులకు పంపిణీ చేశారు. మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, పార్టీ నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, మాజీ కార్పొరేటర్లు అఖిల్ ఫిరోజ్, శర్ఫుద్దీన్, నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పోలీస్ క్రీడోత్సవాలు


కబడ్డీలో తలపడుతున్న బాసర-రాజన్న సిరిసిల్ల జోన్ల మహిళా జట్లు


రెజ్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఐజీ రమేశ్ రెడ్డి

• రెండోరోజు పోటీలను ప్రారంభించిన స్పోర్ట్స్ ఐజీ రమేశ్ రెడ్డి, సీపీ అభిషేక్ మహంతి

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ వేదికగా జరుగుతున్న తెలంగాణ స్టేట్ మూడో పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2025 పోటీలు ఉత్సాహంగా సాగుతున్నా యి. పోలీస్ క్రీడాకారులు సత్తా చాటుతూ తమ జోన్లకు పతకాలు సాధించి పెడుతున్నారు. బుధవారం పలు మ్యాచ్‌లను స్పోర్ట్స్ ఐజీ రమేశ్‌రెడ్డి, కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి ప్రారంభించారు. క్రీడలతో సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని, వివిధ ప్రాంతాల మధ్య స్నేహ సంబంధాలు పెంపొందుతాయని తెలిపారు. వ్యక్తిత్వం, క్రమశిక్షణ, ఆరోగ్యానికి దోహదం చేస్తాయన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ క్రీడా పతాకాన్ని ఎగురవేయాలని ఆకాంక్షించారు. కరీంనగర్ అడిషనల్ ఎస్పీ శుభం ప్రకాశ్, ట్రైనీ ఐపీఎస్ వసుంధర యాదవ్, ఏసీపీ విజయ్‌కుమార్, ఆర్ఐ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు మెడల్స్ ప్రదానం..

పోలీస్ క్రీడోత్సవాల్లో భాగంగా రెండోరోజు సైకిల్ రోడ్ రేస్, ఆ ర్చరీ, స్విమ్మింగ్, అథ్లెటిక్స్, యోగా, రెజ్లింగ్, బ్యాడ్మింటన్, ఖో ఖో, కబడ్డీ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. 43 బంగా రు, 43 రజత, 49 కాంస్య పతకాల పోరు సాగింది. ఆయా క్రీడల్లో విజేతలుగా నిలిచినవారికి అతిథులు మెడల్స్ ప్రదానం చేశారు.

వీడని యువతి హత్య మిస్టరీ

• జాడ లేని మృతురాలి కుమారుడు


కుమారుడితో మమత (ఫైల్)

గంగాధర(చొప్పదండి): మంచిర్యాల జిల్లాలో అదృశ్యమై, కరీంనగర్ జిల్లాలో శవమై కనిపించిన యువతి హత్య మిస్టరీ వీడటం లేదు. గంగాధర పోలీస్‌స్టేషన్‌లో సోమవారం గుర్తు తెలియని యువతి హత్య కేసు నమోదవగా మృతురాలి కుటుంబ వివరాలు మంగళవారం సాయంత్రం తెలిశాయి. అయితే, ఆమెను ఎవరు తీసుకెళ్లారు.. ఎక్కడ హత్య చేశారు, ఆమె వెంట ఉన్న నాలుగేళ్ల కుమారుడి జాడ తెలియలేదు. కేసును ఛేదించేందుకు పోలీసులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఉండే మమత కాసిపేటకు చెందిన భరత్‌ను ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి ఒక బాబు ఉన్నాడు. కాగా, మమత నాలుగు నెలల క్రితం ఇంటి నుంచి మంచిర్యాల వచ్చి, తెలిసినవారి ఇంట్లో ఉంటోంది. ఈ నెల 25న సాయంత్రం నూనె ప్యాకెట్ తీసుకువస్తానని కుమారుడితో కలిసి బయటకు వచ్చింది. ఆమె కారు ఎక్కిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. తర్వాత కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిలో గంగాధర మండలం కొండన్నపల్లి బస్టాండ్ సమీపంలోని మామిడితోట వద్ద రోడ్డు పక్కన మమత శవమై కనిపించింది. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతురాలి ఫొటోతో అన్ని పోలీస్‌స్టేషన్లకు పంపించారు. మంచిర్యాలలో ఉండే ఆమె కుటుంబసభ్యులు గుర్తించి, మంగళవారం సాయంత్రం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. బుధవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పోలీసులు వారికి అప్పగించారు. మమత హత్యపై, ఆమె కుమారుడి ఆచూకీ కోసం ఆరా తీస్తున్నారు. మృతురాలు ఎక్కిన కారు ఎవరిది, అందులో ఉన్నది ఎవరు, ఎటు తీసుకెళ్లారు అనే విషయాలు తెలుసుకునేందుకు పోలీసులు సీసీ పుటేజీల ఆధారంగా విచారణ చేస్తున్నారు. త్వరలోనే హత్య మిస్టరీ వీడుతుందని ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు.

ప్రేమ విఫలమై యువకుడు బలవన్మరణం

బెల్లంపల్లి: ప్రేమించిన యువతితో వివాహం కాకపోవడంతో మనస్తాపం చెంది యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో చోటుచేసుకుంది. టూటౌన్ ఎస్సై కె.మహేందర్ కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామానికి చెందిన చింతల వివేక్(21) ఇటీవల బెల్లంపల్లిలోని రడగంబాల బస్తీలో ఉంటున్న తన అమ్మమ్మ రేగుల లింగమ్మ ఇంటికి వచ్చాడు. అప్పటినుంచి మానసికంగా బాధపడుతూ దిగాలుగా ఉంటున్నాడు. కుమారుడిని చూసేందుకు రెండురోజుల క్రితం అతడి తల్లి రాజేశ్వరి కూడా బెల్లంపల్లికి వచ్చింది. మంగళవారం అర్ధరాత్రి వరకూ వివేక్ గదిలో టీవీ చూస్తూ పడుకోగా తల్లి రాజేశ్వరి, అమ్మమ్మ హాలులో పడుకున్నారు. బుధవారం ఉదయం నిద్రలేపేందుకు తలుపు తీసి చూడగా రేకుల పైకప్పుకు చీరతో ఉరేసుకుని కనిపించాడు. ప్రేమ విఫలం కావడంతోనే తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

టెక్స్‌టైల్ ఆఫీస్ బీవైనగర్‌లో కొనసాగించాలి



మాట్లాడుతున్న మూశం రమేశ్

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల బీవైనగర్‌లో ఉండే చేనేత, జౌళిశాఖ కార్యాలయాన్ని యథాస్థానంలోనే ఉంచాలని పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ కోరాడు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లడుతూ సిరిసిల్ల బీవై.నగర్‌లో ఏళ్లకాలంగా కార్మికులకు అందుబాటులో ఉండి సేవలందించిన చేనేత జౌళిశాఖ కార్యాలయాన్ని కలెక్టరేట్‌కు మార్చడం సరికాదన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోడం రమణ, నక్క దేవదాస్, సిరిమల్ల సత్యం, బింగి సంపత్, గడ్డం రాజశేఖర్ పాల్గొన్నారు.

ఇద్దరి రిమాండ్

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం రామలక్ష్మణపల్లెలో మానేరు వాగు నుంచి ఇసుక తరలిస్తున్న పాక చంద్రమౌళిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్ చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 28న రామలక్ష్మణపల్లెలో ఇసుక రవాణా చేస్తున్నారనే విషయం తెలుసుకున్న పత్రిక విలేకరి దేవరాజు సంఘటన స్థలానికి వెళ్లి ఫొటోలు, వీడియోలు తీశాడన్నారు. ఫొటోలు, వీడియోలు తీయవద్దని చంద్రమౌళి, అతని స్నేహితులు చెప్పగా అక్కడి నుంచి దేవరాజు వెళ్లిపోయాడన్నారు. ఆవునూర్‌లో తన ఇంటికి వెళ్లిన దేవరాజును చంద్రమౌళి బెదిరించాడన్నారు. ఫొటోలు డిలీట్ చేయకుంటే చంపుతానని బెదిరింపులకు గురిచేయడంతో దేవరాజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. టిప్పర్, కారు, బైక్‌ను స్వాధీనం చేసుకుని, చంద్రమౌళిని రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. దేవరాజు తనను బ్లాక్‌మెయిలింగ్ చేశాడని చంద్రమౌళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దేవరాజును రిమాండ్‌కు తరలించడం జరిగిందని డీఎస్పీ వివరించారు.

గీత కార్మికుడికి గాయాలు



కోనరావుపేట: మండలంలోని బావుసాయిపేటకు చెందిన మామిండ్ల ఎల్లయ్య గౌడ్ బుధవారం ఉదయం కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. గాయపడిన ఎల్లయ్యను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు